# పతంజలి సాహిత్యం

(లభ్యరచనల సంకలనం)

## మొదటి సంపుటం

నవలలు

ఎమెస్కో

## ఇందులో ....


ఖాకీవనం ........................................................ 11 - 112

పెంపుడు జంతువులు ........................................... 113 - 248

రాజుగోరు........................................................ 249 - 342

వీరబొబ్బిలి ........................................................ 343 - 382

గోపాత్రుడు ........................................................ 383 - 436

పిలకతిరుగుడు పువ్వు............................................ 437 - 458

అప్పన్న సర్దార్.................................................. 459 - 620

ఒక దెయ్యం ఆత్మకథ............................................ 621 - 664

నువ్వేకాదు ........................................................ 665 - 786

రాజుల లోగిళ్ళు .................................................. 787 - 920

DOGGISH DABBLER .................................. 921 - 944

# ముందుగా....

మనవాళ్ళు కొందరు రథాలను వెనక్కి మళ్ళించేస్తున్నారు. కొందరు రథాలను విప్పేస్తున్నారు. కొందరు వాటిని ఎముకలు, పుర్రెలూ మొదలైన వ్యాపార సరకుల రవాణాకు సిద్ధం చేస్తున్నారు. కళలకు, సాహిత్యానికీ ఇది కలం కాదంటున్నారు. కవిత్వానికి ఆయుష్షు తీరిపోయిందంటున్నారు. కథలకు రెక్కలు విరిగిపోయాయంటున్నారు. సాంస్కృతిక రంగంలో అంధయుగం ఆరంభం అయిందంటున్నారు. పతివ్రతల్లాగ, కుల స్త్రీల్లాగ బతికిన పత్రికలు సైతం వేశ్యావాటికల్లాంటి వ్యాపార కూడళ్ళకు తరలిపోయాయంటున్నారు. అబ్బే! ఇంక లాభం లేదంటున్నారు.

ఇదంతా చూసి నాకు కొంత చిరాకేస్తున్నది. కోపం వస్తున్నది. ఏడుపు మొగాలతో, దిగులు, చీమిడి ముక్కులతో తిరిగే రచయితలను లాగి లెంపకాయ కొట్టాలనిపిస్తున్నది.

ఎందుకంటే–

జీవితాన్ని ఆలంబన చేసుకున్న సాహిత్యానికి దిగులేమిటి? జీవన గంధాన్ని పరివ్యాప్తం చేసే కవిత్వానికి బెంగేమిటి? జీవితాన్ని అల్లుకుని పెరిగిన సాహిత్యాలకు బెదురేమిటి?

కళా సాహిత్య రంగాల మీద కరెన్సీ పడగ నీడ ఏనాడో పడింది. అంతటి అందమైన, అపురూపమైన ఏడెన్ గార్డెన్‌లో కూడా ఒక పాము ప్రవేశించిన తీరుగా ఈ రంగంలో కూడా వ్యాపారం ప్రవేశించింది. ఇది దుర్వ్యవస్థే కావచ్చు గానీ, అనివార్యమైన దురవస్థ. అయినప్పటికీ గుండెలు బాదుకోవలసిన అవసరం లేదు. వ్యాపారాన్ని సాహిత్యానికి పట్టిన గ్రహణం కింద పరిగణించడానికి వీలులేదు. వ్యాపార సాహిత్యాన్ని ముసలం కింద భావించడానికి కూడా వీలులేదు.

మంచి అభిరుచికీ మంచి సాహిత్యానికీ ఎప్పుడూ కొదవలేదు. మూడు దశాబ్దాల చరిత్ర అవలోకించితే ఒక విషయం అతి సులువుగా తేలిపోతుంది.

పందొమ్మిది వందల అరవైలలో తెలుగు పత్రికలను పరిపాలించి, తెలుగు ప్రచురణ కర్తలకు లాభాలంటే చవిచూపిన రచయిత్రి ఇపుడు వ్యాపార రాజ్యంలోనే అజ్ఞాతవాసంలోకి వెళ్ళిపోయారు. ఆమె తర్వాత వచ్చిన కొత్తతరం పాఠకులకు ఆరాధ్య దైవంగా ఎదురులేని వ్యాపార రచయితగా వెలిగిపోయిన మరో అతి ప్రముఖ రచయిత కూడా ఇపుడు కడవరసలోకి జారిపోయాడు, ఆ తర్వాత వచ్చిన వారి సంగతి మరికొన్ని సంవత్సరాలు పోతే తెలుస్తుంది. వ్యాపార సాహిత్యం కెరట కెరట కెరటాలుగా, లాభ లాభ లాభాలుగా వస్తూంటుంది.

అప్పటికీ ఇప్పటికీ మంచి సాహిత్య సృష్టి చేసిన వారు అలాగే వున్నారు. వారి సాహిత్యం కొనుగోలు చేసే వారి సంఖ్య ఎంతో కొంత పెరిగిందే గానీ తరగలేదు. అభిరుచిగల తెలుగు వారందరూ అట్టి మేలి రచయితలకు నీరాజనాలు పడుతూనే వున్నారు. కాకపోతే వయసు మీదపడీ, అలసిపోయి, జీవితంలో ఏ ఇతర చిరాకుల వల్లనో పెద్దలెవరూ పెద్దగా రాయడం లేదు. చాలా మంది పెద్దలు వెళ్ళిపోయారు కూడా.

దీనితో కుర్రకారుకి బెంగ పట్టుకుంది. అయ్యో మన రచనలకి ఆదరణ లేదా, అయ్యో మనకి కీర్తిగాని, కనక వర్షం గానీ దక్కడంలేదే, అయ్యో మనం రాసిన మేలిసాహిత్యం వేలాది ప్రజలకు అమ్ముడు కావడం లేదే అని బెంగ పెట్టేసుకుంటున్నారు.

కేవలం లాభాల కోసం మాత్రమే పత్రికలు నడుపుకొనే వాళ్ళు ఏ సరుకు బాగా అమ్ముడైతే ఆ సరుకే ప్రచురిస్తారు. పాఠకులు ఏరి కోరిన సరుకునే వారు సరఫరా చేస్తారు. అందు గురించి వారిని శాపనార్థాలు పెట్టాల్సిన పనిలేదు. వెనుకటి రోజుల్లో సాహిత్యసేవ చేసినట్టు పోజు పెట్టితేగానీ పత్రికలు అమ్ముడు కావని భయపడి ఆ పోజుపెట్టేవారు. ఇపుడా ఖర్మ లేకుండాపోయింది.

శాకాహారం నడిస్తే అదే వడ్డిస్తారు. గొడ్డుమాంసం నడిస్తే అదే వడ్డిస్తారు. నరమాంసం బాగా నడుస్తుందంటే అదీ వడ్డించక తప్పదు. తప్పు తినేవాడిదే గానీ వడ్డించే వాడిది కాదు. ధర్మ వ్యాధుడు మాంసం అమ్ముకొని కొంత ముక్తి సంపాదించుకోవడానికి కారణం కూడా ఇదే.

పరిస్థితి కొంత చెడినమాట యథార్థమే గానీ అంతా అయిపోయిందని గగ్గోలు పెట్టవలసిన అవసరం లేదు.

ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏం చేయాలంటే–

మనం మరింత పెను క్రోధంతో, పెను పట్టుదలతో, పెను పరిశ్రమతో రాయాలి. హృదయాలను చిదిమి దీపం పెట్టి, మానవజాతి మీద మనకున్న ప్రేమను, సాహిత్యం మీద మనకున్న మమకారాన్ని మరింత బలంగా, నరనరంగా అవ్యక్తం చేయాలి.

మన ఆయుర్దాయాన్ని ధారపోసి, రక్త మాంసాలు వెచ్చించి, వ్యాపారపు కాటుక పొగలను, అధికారపు తుపాకీ పొగలను కకావికలు చేసే రాగసుధ ఊహల రెక్కలను ప్రళయ భయంకరంగా విప్పాలి. మన రెక్కల తాకిడికి చీకట్లు కూడా బెదరిపోవాలి.

అప్పుడు.... అంతా చీకటిగా వున్నప్పుడు మన గురజాడ చేసినది అదే. ఆ తర్వాత మన శ్రీ శ్రీ ఆ పనే చేశారు. మన రాచకొండ విశ్వనాధ శాస్త్రీ అదే పని చేశారు.... ఇపుడు మనం రెక్కలైనా లేనివాళ్ళం గనుక ఇలాగ దిగులు పడిపోతున్నాం.

మనలో ఎవడో ఒకడు గరుత్మంతుడై రెక్కలు సారించే వరకు ఈ దుస్థితి తప్పదు. ఈ లోపల మనం రాద్దాం. మన రాతలు చచ్చుగా వుంటే – గాలికీ, ధూళికీ కొట్టుకుపోతాయి. అందుకు సందేహం లేదు, అందుగురించి చింతా లేదు.

పంధొమ్మిది వందల డెబ్బయి తొమ్మిదిలో నేనీ చిన్న నవల రాసేను. ఎనభై నవంబరు నెలలో చతుర మాస పత్రికలో వచ్చింది. తరువాత మళ్ళా ఇన్ని సంవత్సరాలకు శ్రీ వంశీ కృష్ణవారు సాహసించి దీన్ని పుస్తకంగా వేస్తున్నారు. అప్పట్లో పోలీసుల మీద నవల వేస్తే ఏమిటవుతుందో ఏమిటో అని ఆనాడు చతుర సంపాదకులు శ్రీ చలసాని ప్రసాదరావుగారు కొంత జంకితే – ఇపుడీ పుస్తకం వేస్తే అమ్ముడవుతుందో లేదో అని జంకుతో శ్రీ దుర్గారావుగారు దీన్ని వేస్తున్నారు. ఆ రకంగా ఇద్దరూ కొంత సాహసించినందుకు, రిస్కు తీసుకోవలసినందుకు ఇద్దరికీ కృతజ్ఞతలు.

హైదరాబాద్
10.3.1987 **– కె.ఎస్.వై. పతంజలి**



**“ఒరే!” అని పిలిచింది కొత్త ఎస్.పి. భార్య. సుందరయ్య తుళ్ళిపడి చూశాడు.**

“ఇప్పుడే వస్తానమ్మగారూ అని చెప్పిన ఆ పనిలంజ అదే పోత పోయినట్టుంది. ఈ దిక్కుమాలిన వూరిలో మరో ముండే దొరకలేదా మీకు? మీ అయ్యగారికీ? దాని గుండెల మీద తన్ని తగిలేసి మరోదాన్ని తీసుకురండి... ఇదిగో చంటిది దొడ్డికి కూచున్నట్టుంది..... కాస్త కడిగీ...” అని చెప్పి ఆవిడ విసవిసలాడుతూనే లోపలికి వెళ్ళిపోయింది.

సుందరయ్య కొయ్యబారిపోయాడు. చారల టోపీతో పాటు బుర్రకూడా, వీధి వరండాలోనే జాగ్రత్త చేసి రానందువల్ల పళ్ళ బిగువున కదిలి ‘అమ్మగారు’ చెప్పిన పని పూర్తి చేసి పెరటిలోంచి చుట్టూ తిరిగి వీధిలోకి వచ్చాడు.

సాయంత్రం అయిదున్నర అయింది.

ప్రహరీ గోడకు ఆనుకుని వున్న నీలగిరి చెట్టు కింద ఆర్డర్లీ కానిస్టేబుల్స్ నుంచొని వున్నారు. సుందరయ్య అక్కడికి చేరుకున్నాడు.

“ఈవిడగారికి ఒళ్ళంతా కొవ్వేర్రా బాబూ! పనిమనిషి రాలేదని పిల్ల ముండ ముడ్డి నాచేత కడిగించింది. అసలీ ఎస్.పి. నంజి కొడుకుని చెప్పుచ్చుకుని కొడితే ఆడి పెళ్ళానికి బుద్ధొస్తుంది” సుందరయ్య చాలా కోపంగా మాట్లాడినప్పటికీ ఆ మాటలు ఇంటిలో వున్న ‘అమ్మగారికీ’ ‘చిన్నమ్మగారికీ’ వినిపించకుండా జాగ్రత్తపడ్డాడు.

అక్కడ నిల్చొని వున్న నలుగురిలోనూ ముగ్గురు సుందరయ్య కేసి జాలిగా చూస్తే, నాలుగో కానిస్టేబుల్ మాత్రం పక పక నవ్వాడు. అతని కళ్ళు పెంకెగా మెరిసాయి.

“ఈ పద్ధతి మంచిదేర్రా పెద్దబ్రదరూ!” అన్నాడతను ఎందుకయినా మంచిదని సుందరయ్యకు దూరంగా జరుగుతూ... “ఇంట్లో ఎవరు లేకపోతే వాళ్ళ పని మనచేత చేయించుకోవటం మంచి పద్దతే! రాత్రిపూట దొరగారు లేరనుకో అప్పుడా ఛాన్సు నీకే. అల్లుడు లేడనుకో ఆ ఛాన్సు మాత్రం నాది. మనిద్దరం లేకపోతే మరి వీళ్ళకే ఛాన్సు.”

“నోరుముయ్.. నోర్ముయ్... వోరి కుర్ర నాకొడకా! నీది నోరా, పాయిఖానా దొడ్డా... ఏటా మాట్లేంటి? ముందూ వెనుకా చూసుకోకుండా పీకలెగిరిపోయీ మాటలనేస్తున్నావు... జాగర్త!” అని కంగారుపడ్డాడు అరసవిల్లి అనే ఆర్డర్లీ.

సుందరయ్య ఇదంతా వినిపించుకోవటంలేదు. తన ఎడమ చేతి నుంచి ఇంకా దుర్గంధం వస్తున్నట్టు తోచిందతనికి. నిక్కరుకు చేయి రుద్దుకున్నాడు ఎటో చూస్తూ.